క్లుప్తంగా

ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలను తొలగించిన సిబ్బంది

ఇబ్రహీంపట్నం: ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగియడంతో ఇబ్రహీంపట్నం మండలంలో వివిధ పార్టీలకు చెందిన ప్రచార ఫ్లెక్సీలు తొలగించకపోవడంతో ఎన్నికల సిబ్బంది వాటిని తొలగించే పనిలో నిమగ్నం అయ్యారు. గ్రామాలలో ప్రధాన కూడళ్లో వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను పెట్టారు. కానీ వాటిని సమయం దాటిపోయినా ఆయా పార్టీల నాయకులు తీసివేయకపోవడంతో ఎన్నికల సిబ్బంది తీసివేశారు.

ఎన్నికలకు పటిష్ట భద్రత

కథలాపూర్: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పోలీస్‌శాఖ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కథలాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు, పురుషులు వేర్వేరుగా క్యూలో ఉండేలా సూచికబోర్డులు ఏర్పాటు చేయించామన్నారు. పోలింగ్ రోజు వివాదాలు జరగకుండా ముందస్తుగా మండలంలోని 19 గ్రామాల నుంచి 87 మందిని బైండోవర్ చేసి వారికి పలు సూచనలిచ్చామని పేర్కొన్నారు.

దుబ్బరాజన్న క్షేత్రంలో శైవ క్షేత్ర వనితా శక్తి భక్తులు



ఆలయం ఎదుట శైవక్షేత్ర వనితా శక్తి భక్తులు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్నను మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన శైవక్షేత్ర వనితా శక్తి భక్తులు మంగళవారం తరలివచ్చి పూజలు నిర్వహించారు. కార్తీకమాసంలో భాగంగా స్వామివారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు ప్రసాదాలు అందించారు. దుబ్బరాజన్న క్షేత్ర మహిమ చాలా ఉందని, ఈ విషయం తెలుసుకుని స్వామివారి దర్శనానికి వచ్చామని వారు పేర్కొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



ఓటు వేసిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సారంగాపూర్: బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం రుచిగా ఉండడం లేదని స్థానిక యువచైతన్య యూత్ సభ్యులకు చెప్పడంతో భోజనం పరిశీలించి నిర్వాహకులను ప్రశ్నించారు. తమకు బిల్లులు రావడం లేదని, కూరగాయలు, ఇతర సామగ్రి కొనడం చాల ఇబ్బందికరంగా ఉందని, అయినప్పటికీ భోజనం నాణ్యతతో అందిస్తున్నామని మధ్యాహ్న భోజన నిర్వాహకులు తెలిపారు. హెచ్‌ఎం రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని తెలుపడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రతి పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తాం



రేచపల్లి సభలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్/జగిత్యాలరూరల్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలతో పాటు, ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తామని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అ న్నారు. మండలంలోని రేచపల్లి, నాయికపుగూడెం, సారంగాపూర్ గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేశారు. నిరుద్యోగులను బీఆర్‌ఎస్ మోసం చేసిందని పాలాసలో నిర్వహించిన ప్రచారంలో అన్నారు.

అభివృద్ధిని చూసే పార్టీలో చేరికలు



యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

• బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసే యువకులు పార్టీలో చేరుతున్నారని వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. ఈసందర్భంగా ఓటు హక్కు పొందిన యువకులు తమ మొదటి ఓటును అభివృద్ధి, సేవాభావం చూసి బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావుకే వేస్తామని పేర్కొంటూ కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 50 మంది మంగళవారం ప్రకటించారు. గ్రామ సర్పంచ్ మంతెన సంతోష్, ఎంపీటీసీ పల్లె మంజులరవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని చల్మెడ నివాసంలో ఆయన్ని కలిసి ×మీకే మా మొదటి ఓట్లు అంటూ ప్రకటించారు. ఈనేపథ్యంలో చల్మెడ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇంటింటా ప్రచారం



మరిమడ్లలో ప్రచారం చేస్తున్న విజయభాస్కర్‌రావు తదితరులు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మరిమడ్లలో కేటీఆర్ మేనబావ విజయభాస్కర్ రావు, మండల నాయకురాలు నేరెళ్ల జ్యోతి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పల్లిమక్త, కనగర్తిలో నాయకులు జిన్న అనిల్, చింతకుంట అనిల్, ఎనగంటి కిషన్, భూంరెడ్డి, గోపాల్, కిషన్ ఈవీఎంలు చూపుతూ ప్రచారం నిర్వహించారు. మల్కపేటలో సింగిల్‌విండో డైరెక్టర్ జవ్వాజి దేవయ్య కార్యకర్తలతో కలిసి ఇంటింటా ఓట్లు అభ్యర్థించారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

• ధర్మపురి బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్: ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేయాలని చూస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం ఎండపల్లి మండల కేంద్రంతో పాటు, గొడిశెలపేట గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుబంధు రాకుండా చేసి కాంగ్రెస్ పార్టీ రైతుల నోట్లో మట్టి కొట్టిందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. దేశంలోనే అభివృద్ధిలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ చీకటి రోజులేనని, రైతులకు మూడు గంటల కరెంట్ మాత్రమే ఇస్తుందని, మూడు గంటల కరెంట్ కావాలో.. మూడు పంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వం కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆదరించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి నిరుద్యోగుల నిరసన

మంత్రి ఈశ్వర్‌కు ఎండపల్లిలో నిరుద్యోగుల నుంచి నిరసన ఎదురైంది. ప్రజా ఆశీర్వాదయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను కొందరు యువకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేశారని, ఏ ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని, దళితబంధు ఎంతమందికి చేరిందని, గృహలక్ష్మి పథకం అమలు చేయలేదని నిరసనకు దిగారు. పోలీసులు యువకులను పక్కకు తొలగించారు.

దళితులంటే మంత్రి కేటీఆర్‌కు చిన్నచూపు



పెగడపల్లిలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న లక్ష్మణ్ కుమార్, పాల్గొన్న ప్రజలు

• ధర్మపురి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్: దళితులంటే మంత్రి కేటీఆర్‌కు చిన్నచూపని ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడారు. సోమవారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా వెల్గటూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ బహిరంగసభలో మాట్లాడుతూ తనపై ఇష్టం వచ్చిన రీతిలో అవమానకరమైన వాఖ్యలు చేశారని, పేద దళిత కుటుంబంలో జన్మించిన తనను వాడు వీడు అని మంత్రి అవమానకర రీతిలో మాట్లాడుతుంటే దళిత కుటుంబంలో పుట్టడమే నేరమా అనిపిస్తుందన్నారు. అనుచిత వాఖ్యలు చేసి తనను, యావత్ దళితజాతిని అవమాన పరిచిన మంత్రి కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని, మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 24 గంటల్లో కేసు నమోదు చేయకుంటే వెల్గటూర్ అంబేడ్కర్ విగ్రహం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, సర్పంచ్ మేరుగు మురళి, ఎంపీటీసీ మంజుల,యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రావు,రమేశ్ పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ సునామీ రాబోతుంది

పెగడపల్లి:తెలంగాణలో కాంగ్రెస్ సునామీ రాబోతుందని ధర్మపురి ప్రజలు ఆశీర్వదించి తనను అసెంబ్లీకి పంపిస్తే ప్రజా సమస్యల పరిష్కారంతో అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ధర్మపురి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పెగడపల్లిలో కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. నాలుగు పర్యాయాలు ఓటమి చెందిన తనను ఒకసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల రుణం తీర్చుకుంటానని చెప్పారు. టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ గజ్జల స్వామి, బతికపల్లి సర్పంచి శోభారాణి, నాయకులు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

ధర్మారం: ఎన్నికల్లో ఓడినా ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతున్న తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ధర్మపురి అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మారం మండలం గోపాల్‌రావుపేట, నందిమేడారం గ్రామాల్లో మంగళవారం పార్టీ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు.గోపాల్‌రావుపేట మాజీ సర్పంచు చింతల జగన్మోహన్‌రెడ్డి, కొత్తూరు ఎంపీటీసీ తాళ్లపెల్లి భద్రమ్మ, లింగయ్య కాంగ్రెస్‌లో చేరారు.

లక్ష్మీనృసింహుడి సాక్షిగా ఆరు గ్యారంటీలు

ధర్మపురి: 'ధర్మపురి లక్ష్మీనృసింహుడి సాక్షిగా నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు సాక్షిగా కాంగ్రెస్‌ను గెలిపిస్తే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తాను' అని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తానంటూ బాండ్ పేపర్‌పై రాసి చదివి వినిపించారు. కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి అనిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

పెగడపల్లి: ఈ నెల 30న జరిగే సాధారణ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని మల్యాల సీఐ కోటేశ్వర్ అన్నారు. పెగడపల్లి మండలం బతికపల్లిలో మంగళవారం ఇండియన్ రిజర్వ్ బెటాయలిన్ బలగాలు, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై సతీశ్, బీఎస్‌ఎఫ్ కమాండెంట్ పవిత్రకుమార్, భూమేశ్, పోలీసులు పాల్గొన్నారు.

వెల్గటూర్‌లో కేంద్ర బలగాల కవాతు

వెల్గటూర్: ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఓటర్ల సహకరించాలని ధర్మపురి సీఐ రమణమూర్తి, ఎస్సై శ్వేత అన్నారు. వెల్గటూర్, ఎండపల్లి మండల కేంద్రాల్లో మంగళవారం కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





పెగడపల్లి మండలం బతికపల్లి, వెల్గటూర్ ఎండపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు,కేంద్ర సాయుధ బలగాలు

గ్యారంటీలు అమలుచేసే బాధ్యత నాదే



లింగంపల్లిలో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

• కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్

వేములవాడ: 'ఈ ఎన్నికల్లో నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలపై రాజన్న సాక్షిగా బాండ్ పేపర్‌పై సంతకం చేసి అందిస్తున్నా.. గ్యారెంటీలు అమలుచేసే బాధ్యత నాదే' అని కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. ఇచ్చిన మాటకు రాజన్న సాక్షిగా కట్టుబడి ఉంటానని మంగళవారం రాజన్నను దర్శించుకున్న అనంతరం ఆలయ మెట్ల వద్దే బాండ్‌పేపర్‌ను నియోజకవర్గ ప్రజలకు మీడియా ద్వారా అందజేశారు. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

'ఆది'కి నీరాజనం

వేములవాడరూరల్/కోనరావుపేట/రుద్రంగి/వేములవాడఅర్బన్: వేములవాడరూరల్ మండలం లింగంపల్లి తదితర గ్రామాల్లో ఆది ప్రచారం చేపట్టారు. అలాగే కోనరావుపేట మండలం మామిడిపల్లి, మరిమడ్లలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. ఆది శ్రీనివాస్‌ను గెలిపించాలని రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత కోరారు. 70 ఏళ్లుగా ఒకే కుటుంబం వేములవాడ ప్రాంతాన్ని పాలించిందని, బీసీ ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాలకు అవకాశం రాలేదని టీపీసీసీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ బుర్ర రవితేజగౌడ్ ప్రకటనలో తెలిపారు. బీసీ బిడ్డ ఆది శ్రీనివాస్‌కు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.



బాండ్ పేపర్ చూపుతున్న ఆది శ్రీనివాస్

'అర్వింద్ తీరు నచ్చకనే బీజేపీని వీడాం'



మాట్లాడుతున్న రాజశేఖర్

కోరుట్ల: నిజామాబాద్ ఎంపీ, కోరుట్ల బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ తీరు నచ్చకనే బీఆర్‌ఎస్‌లో చేరామని మున్సిపల్ కౌన్సిలర్ దాసరి సునీత, బీజేపీ కోరుట్ల టౌన్ మాజీ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేసినప్పటికీ ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని, అంతే కాకుండా బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ ఫోటోలను తన ప్రచారంలో ఎక్కడా వినియోగించటం లేదని అది మమ్మల్ని చాలా బాధించిందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తమకు పార్టీలో సముచిత స్థానం ఇస్తామని , మద్దుల చెరువు వరద కాల్వ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందుకే బీఆర్‌ఎస్‌లో చేరామన్నారు.

'ఒక్కసారి అవకాశం ఇవ్వండి ఇంటింటా ఆరు గ్యారంటీలు'

మల్యాల: ఇంటింటా కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని, ప్రజలు ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని చొప్పదండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి, మల్యాల అంగడి బజార్‌లో మాట్లాడారు. పదేళ్లుగా ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని, చొప్పదండి ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని మేడిపల్లి సత్యం అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శేర్ల పద్మ, సతీశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్వింద్‌కు మద్దతుగా ద్విచక్ర వాహన ర్యాలీ



పట్టణంలో ర్యాలీ తీస్తున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ధర్మపురి అర్వింద్‌కు మద్దతుగా మంగళవారం పట్టణంలో ఆ పార్టీ నాయకులు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. పుర వీధుల గుండా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చిట్నేని రఘు, చెట్లపల్లి సుఖేందర్, బొడ్ల రమేశ్, దొనికెల నవీన్ తదితరులున్నారు.

జ్యోతి బా పూలేకు నివాళి

మెట్‌పల్లి: సామాజిక వేత్త మహాత్మా జ్యోతి బాపూలే వర్ధంతిని పట్టణంలో మంగళవారం ఏబీవీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మారుతి, ఏనుగంటి సత్యరుషి, గంధం మహేంద్ర, ఈశ్వర్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం సాయంతో వేములవాడ అభివృద్ధి



మాట్లాడుతున్న చెన్నమనేని వికాస్‌రావు



వేములవాడలో మహిళలు, యువతుల బైక్ ర్యాలీ

• బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు

వేములవాడ: తనను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి రాజన్న గుడితోపాటు పట్టణం, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. మంగళవారం చివరిరోజు ప్రచారంలో భాగంగా ఆయన ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం యువతులు, మహిళల బైక్ ర్యాలీని పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, డాక్టర్ దీపతో కలిసి ప్రారంభించారు. విద్య, వైద్యం, రోడ్లు, రవాణా, వ్యవసాయం, యువతకు ఉపాధి మార్గాలు మెరుగుపరుస్తానని హామీ ఇచ్చారు.

బీజేపీ నాయకుల ప్రచారం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిమ్మపల్లి, బావుసాయిపేట, మామిడిపల్లి, నిజామాబాద్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటా తిరుగుతూ వికాస్‌రావును గెలిపించాలని కోరారు. నోముల భాస్కర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. కనగర్తిలో బైక్‌ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు.

జిల్లా ముఖ్య నేతల ప్రచారం

కథలాపూర్: బీజేపీ అభ్యర్థి వికాస్‌రావుకు మద్దతుగా కథలాపూర్ మండలంలోని గ్రామాల్లో ఆ పార్టీ జిల్లా నాయకులు ప్రచారం చేశారు. మండలంలోని సిరికొండ, కథలాపూర్, భూషణరావుపేట, గంభీర్‌పూర్ గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అవినీతి లేని పాలన అందించడం బీజేపీతోనే సాధ్యమన్నారు. నాయకులు ఎడ్మల వినోద్ రెడ్డి, కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, మండలాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

'విద్యార్థుల సమస్యలు విస్మరించిన ప్రభుత్వం'



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

జగిత్యాల: తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యార్థి, నిరుద్యోగ యువతను విస్మరించిందని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అన్నారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో చార్జ్‌షీట్ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించిన పార్టీని ఓడించాలన్నారు. లక్ష ఉద్యోగాల హామీ, ప్రశ్నపత్రాల లీకేజీలతో అభ్యర్థులంతా ఇబ్బందులకు గురయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిరెడ్డి, అక్రమ్, రాహుల్, సౌమ్య, నాగరాణి పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ



రేచపల్లిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి, సారంగాపూర్ గ్రామాల్లో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీ జాక్), భారత్ బచావో ప్రతినిధులు ఓటు వినియోగంపై పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు, జగిత్యాల జిల్లా బాధ్యుడు పొన్నం రాజమల్లయ్య, భారత్ బచావో జగిత్యాల జిల్లా బాధ్యుడు పిట్టల నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలపై అనుసరిస్తున్న నిర్లక్ష్యాన్ని, నిరంకుశ ఫాసిస్టు పాలనను గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందని, ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎంలను ఓడించాలని పిలుపునిచ్చారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



శివ పార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల: పట్టణంలలోని మహాదేవి స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకల్లో భాగంగా శివ పార్వతుల కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వాలా తోరణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు భరాద్వజ, అల్లాడి మహేశ్ మోటూరి ప్రవీణ్, శ్రీహరి, బండి మహాదేవ్, తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో హనుమాన్ జాతర..

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెంలో హనుమాన్ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్నకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చీటి వెంకట్రావు, సర్పంచ్ చెప్యాల నర్సయ్య, ఉప సర్పంచ్ సాగరిక, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం



శ్రీ వేంకటేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకం, విశేష అలంకరణ, కుంకుమార్చన, నిత్యహోమం, రథహోమం, రథబలి అనంతరం వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య వెంకన్న రథోత్సవం నిర్వహించారు. అనంతరం శేషహోమం, మహాపూర్ణాహుతి, నాగవెల్లి, పుష్ప యాగం, చక్రస్నానం, గ్రామబలి, ఏకాంతసేవ అనంతరం ఉత్సవ పరిసమాప్తి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్ శారద, ఆలయ కమిటీ అధ్యక్షుడు కటుకం రాజేశ్, ఆలయకమిటీ సభ్యులు, పురోహితులు పాల్గొన్నారు.